Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 139
సంచిక : 251
పేజీలు : 3
శుక్రవారం, మే 29, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

## తడిసినా ధాన్యం కొంటాం




### -జిల్లా కలెక్టర్ అంకిత్

### మల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యమైతే చర్యలు

**టీ మీడియా, మే 28 , భద్రాద్రి కొత్తగూడెం:**ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.రవాణా, రెవెన్యూ శాఖల సమన్వయంతో అన్ని రకాల వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగిస్తున్నామని, ప్రతి రైస్ మిల్లుకు ప్రత్యేక ఇన్‌ఛార్జ్‌లను నియమించి, అదనపు హమాలీలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా

3లో

# రాష్ట్రంలోనే మోడల్‌గా మధిర లక్ష్యం

### -డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**టీ మీడియా, మే 28 , ఎర్రుపాలెం:**మధిర నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుసగా శంకుస్థాపనలు చేశారు.ముందుగా ఎర్రుపాలెం మండలం గోసవీడు గ్రామంలో" 2 కోట్ల 80 లక్షలతో గోసవీడు నుండి రామకృష్ణాపురం వరకునిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో గోసవీడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 2 కోట్లతో రామన్నపాలెం నుండి కట్లేరు చెరువు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఇనగాలి గ్రామంలోలి 6 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సైదెల్లిపురం వరకు, 3 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సిద్ధినేని గూడెం వరకు నిర్మించనున్న బిటీ రోడ్డు నిర్మాణ పనులకు, 31 లక్షలతో ఇనగాలి ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ములుగుమాడు గ్రామంలోలి కోటి 29 లక్షలతో చేపట్టిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, ములుగుమాడు నుండి నాగవరప్పాడు వరకు 3 కోట్ల 75 లక్షలతో,ములుగుమాడు నుండి సైదేల్లిపురం వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, ములుగుమాడు ఎస్సీ కాలనీలో 63లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.తక్కెలపాడు గ్రామంలోలి 4 కోట్ల 50 లక్షలతో తక్కెళ్ళపాడు నుండి మధిర ఆర్ అండ్ బి రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 69 లక్షలతో తక్కెల పాడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.పెద్ద గోపవరం గ్రామంలోలి 132/33 కేవీ ఎర్రుపాలెం సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, జమలాపురం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేసారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూలి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి అత్యుత్తమ మౌళిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. నిధుల కొరత లేకుండా పనులు వేగంగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు.ప్రధాన రహదారులతో పాటు మారుమూల గ్రామాల అనుసంధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్, మౌళిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌళిక వసతుల కల్పన పనులు చేపట్టడం జరిగిందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద స్వశక్తి మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ, సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో స్థానిక రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు!

### -మంత్రి పొంగులేటి ఆదేశాలతో సమగ్ర మాస్టర్ ప్లాన్



**టీ మీడియా, మే 28 , నేలకొండపల్లి :** నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

**- డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి బృందం**

తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది.

**- ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే**

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీనిద్వారా భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని తీర్మానించారు.

**- ఆధునిక పర్యాటక వసతులు**

ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియో-

మిగతా 3లో

## ఆక్వా రంగంలో ముందుండాలి



### డి ఎఫ్ ఓ ఇంతియాజ్ అహ్మద్.

**టీ మీడియా, మే 28 ,కూసుమంచి:**పుష్కలంగా మంచినీటి వనరులు ఉన్నందున చేపల సాగు లో అభివృద్ధి సాధించి, ఆక్వా రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని ముందు ఉంచాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మత్స్యశాఖ అధికారి మహమ్మద్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. జలాశయాల్లో చేపల పెంపకం యాజమాన్య పద్ధతులు అంశంపై పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో మత్స్యకారులకు జరిగిన 3 వ రోజు గురువారం ముగింపు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేపల సాగు కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో వివిధ పథకాల కింద రుణ సదుపాయాలు కల్పిస్తున్నాయని, అలాగే రైతుల కోసం బ్యాంకులు పలు పథకాల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని, శాస్త్రీయ పద్ధతుల్లో చేపలు సాగుచేసి మత్స్యకారులు రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఇంతియాజ్ అహ్మద్ కోరారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, అధిపతి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే తమ కేంద్రం ద్వారా 4 వేల మందికి శిక్షణ ఇచ్చామని తెలుపుతూ, శిక్షణలో నేర్చుకున్న ప్రతి విషయాన్ని ఆచరణలో పెట్టి అమలు చేయాలని సూచిస్తూ, విషయాన్ని సహచరులు, బంధు మిత్రులకు చెప్పి చేపల సాగుకు ముందుండాలని ఆయన కోరారు. మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ మాట్లాడుతూ చేపల సాగులు దేశ , రాష్ట్రంలోని స్థితిగతులు భవిష్య కార్యాచరణ వివరిస్తూ, కలుపు మొక్కల నివారణ గురించి సంక్షిప్తంగా వివరించారు. చేప పిల్లల హేచరీ తయారీ, బయో ఫ్లాక్ ట్యాంక్ నిర్మాణం, సమీకృత కోళ్ళ,చేపలు ,వరి ,సాగుపై క్షేత్రస్థాయిలో సందర్శించి సవివరంగా చెప్పారు. మత్స్య శాస్త్రవేత్త పీహెచ్డీ స్కాలర్ శాంతన్న మాట్లాడుతూ బడి పంజరాల్లో చేపల సాగు మేలైన యాజమాన్య పద్ధతుల గురించి క్షుణ్ణంగా

మిగతా 3లో



## అప్పాయిగుడెం పంచాయతీ లో హ్యాండ్ పంపుల మరమ్మతులు

### సర్పంచ్, కార్యదర్శికి సన్మానం చేసిన గ్రామస్తులు

**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రిపేర్‌లో ఉన్న హ్యాండ్ పంపుల మరమ్మతులకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా అప్పాయిగూడెం,బిక్యా తండా,తులిస్య తండా గ్రామాల్లోని హ్యాండ్ పంపుల పనితీరును పరిశీలించి, అవసరమైన చోట మరమ్మతులు చేపడుతున్నారు.మొదటగా బిక్యా తండా గ్రామంలోని తిరుపతమ్మ గుడి ఆవరణలో ఉన్న హ్యాండ్ పంపును మరమ్మతు చేశారు.అనంతరం గ్రామంలోని ఇతర హ్యాండ్ పంపుల పనితీరును పరిశీలించి,అవసరాన్ని బట్టి మరమ్మతులు చేపట్టారు.ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు.రానున్న రెండు రోజుల్లో గ్రామ పంచాయతీ పరిధిలో రిపేర్‌లో ఉన్న అన్ని హ్యాండ్ పంపుల మరమ్మతులు పూర్తి చేస్తామని చెప్పారు.నీటి సరఫరా కోసం తీసుకున్న ప్రత్యేక చొరవపై గ్రామ ప్రజలు, తిరుపతమ్మ గుడి అర్చకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణిలను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం కార్యదర్శి కృష్ణవేణి,వార్డు సభ్యులు వాంకుడోత్ రమేష్,అజ్మీరా మమత,మాలోత్ విజయ, బోర్ మెకానిక్ మోహన్ రావు, గ్రామ పంచాయతీ సిబ్బంది సత్యం,శ్రీను,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ అభయ ఆంజనేయస్వామి

### ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు

**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం అప్పాయిగూడెం పంచాయతీ పరిధిలోని తులిస్యాతండా గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు,దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు.ఆలయ నిర్మాణానికి వివిధ ప్రాంతాల నుంచి దాతలు స్పందిస్తూ తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు.గురువారం గుడిపుడి వెంకట్రావమ్మ ట్రస్ట్ చైర్మన్ గుడిపుడి తిరుమలరావు ఆలయ నిర్మాణం కోసం రూ.10,016 విరాళంగా అందజేశారు.గేటు కారేపల్లిలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనను కలిసి ఆలయ నిర్మాణ వివరాలు తెలియజేయగా స్పందించిన తిరుమలరావు వెంటనే విరాళం ప్రకటించారు.అలాగే కారేపల్లి బీసీ కాలనీకి చెందిన టం టం శ్రీను ఆంజనేయస్వామి గుడికి ఫ్యాన్‌ను డొనేట్ చేసి తన భక్తిని చాటుకున్నారు.ఆయనకు గ్రామస్థులు,ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఇదే సందర్భంగా ఆలయ నిర్మాణం కోసం పాలతీయ దేవా రూ.5,516 విరాళంగా అందజేయగా, వేరే పెళ్లికి చెందిన ఈరయ్య రూ.5,000 విరాళంగా అందించారు.దాతల సేవాభావాన్ని గ్రామస్థులు అభినందించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ... గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించేందుకు నిర్మిస్తున్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయానికి మరింత మంది దాతలు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో వల్లబినేని చంద్రశేఖర్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సపావట్ నాగులు,పల్యా. శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ నమాజ్ నిర్వహణ



### ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ)

**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):** జామే మస్జిద్ సదర్ కమిటీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద బక్రీద్ పండుగ (ఈదుల్ అజ్హా) నమాజ్‌ను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజామున నుంచే పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.పరస్పరం ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.ఈ సందర్భంగా జామే మస్జిద్ అధ్యక్షులు షేక్ మునీరుద్దీన్ పటేల్ మాట్లాడుతూ... ఈదుల్ అజ్హా పండుగ త్యాగానికి, సహనానికి ప్రతీక అని తెలిపారు.ప్రవక్త ఇబ్రహీం చూపిన త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని, ప్రేమ, సోదరభావంతో సమాజంలో కలిసిమెలిసి జీవించాలని సూచించారు.పేదలకు సహాయం చేయడం, మానవతా విలువలను కాపాడడం ఈ పండుగ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ఈద్గా వద్దకు చేరుకొని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.అన్ని మతాలు శాంతి, ప్రేమ, సోదరభావాన్ని బోధిస్తాయని, గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉండటం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ ఉపాధ్యక్షులు షేక్ షఫీ, షేక్ అబ్దుల్ మతీన్, షేక్ శంషుద్దీన్, మౌలానా అబ్దుల్ మజీద్, బాబు సార్, హనీఫ్, షేక్ తాజుద్దీన్, మహమ్మద్ నసీర్, సర్దార్, యాకుబ్ అలీ, నూరుల్ అతీక్, పారుఖ్, షేరు, ముజామిల్, మహమూద్ పాషా, ఖైరుద్దీన్, కబీర్, జావిద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



## రేణుకా చౌదరి నిధులతో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీలో రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి గారపాటి రేణుకా చౌదరి నిధులతో మంజూరైన సీసీ రోడ్డు పనులను ఘనంగా ప్రారంభించారు.గుగులోత్ బిచ్చ ఇంటి నుండి ఆలోత్ రాందాస్ ఇంటి వరకు రూ.4 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ గుగులోత్ బీక్కు లాల్ నాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ వెనుకబడిన గ్రామపంచాయతీల అభివృద్ధికి రాజ్యసభ నిధుల ద్వారా సీసీ రోడ్డు మంజూరు చేసిన రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.పంచాయతీలో ఇంకా అనేక రహదారులు అభివృద్ధికి నోచుకోలేదని, మరిన్ని నిధులు కేటాయించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఈశ్వరి నందరాజు పోలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ బద్రు నాయక్, వార్డు సభ్యులు గుగులోత్ నాగేష్, తేజావత్ భూలి, భూక్య కిషన్ నాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుగులోత్ హర్ష నాయక్, గుగులోత్ వీరన్న, తారాచంద్, రాందాస్, బిచ్చ, ఆలోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## సిపిఎంపై బీజేపీ,కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

### సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు

**టీ మీడియా,మే28, సింగరేణి (కారేపల్లి):**ప్రతిపక్షాలపై, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలపై రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడుపుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు ఆరోపించారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరాయి విజయన్‌పై ఈడీ, ఐటీ, సీబీఐ సంస్థల సోదాలకు నిరసనగా గురువారం కారేపల్లిలో సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ...రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేసి, పదేళ్లపాటు కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడిపై అవినీతి ముద్ర వేయాలని కుట్రపూరితంగా సోదాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు.గతంలో కూడా అనేక ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై కేసులు పెట్టి ముఖ్యమంత్రులను జైలుకు పంపారని,అనంతరం వారు నిర్దోషులుగా బయటపడ్డారని గుర్తుచేశారు.ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని,ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ కూడా బీజేపీతో కలిసి పనిచేస్తోందని ఆరోపించారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజా ఉద్యమాల ద్వారా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర మాట్లాడుతూ... పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ డ్రామాలు చేస్తున్నాయని విమర్శించారు.ప్రజలతో ఎలా మెలగాలో కమ్యూనిస్టు నాయకులను చూసి నేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ముక్కా సీతారాములు, హమాలీ సంఘం మేస్త్రి ఆరేళ్ళి శ్రీరాములు, రాబోతు కోటయ్య, తిరపయ్య, సంపత్, కేతమల్ల సైదులు, బాబు,సంపత్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు ద్వారా రైతులకు రూ.2.99 కోట్ల అదనపు లాభం

### బకాయి రుణాల వసూళ్లకు కఠిన చర్యలు

### సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు



**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):** వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవతో కారేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు కోట్ల రూపాయల అదనపు లాభం చేకూరిందని కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు తెలిపారు.గురువారం కారేపల్లి సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాధారం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ద్వారా 803 మంది రైతుల నుంచి మొత్తం 49,758.50 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు.ఈ కొనుగోలు విలువ రూ.11.94 కోట్లకు చేరిందన్నారు.ప్రభుత్వ మద్దతు ధర కారణంగా రైతులకు సుమారు రూ.2.99 కోట్ల మేర అదనపు లాభం చేకూరిందని వెల్లడించారు.మొక్కజొన్న కొనుగోలు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే పైకం విడుదల చేసిందని, మరో మూడు రోజులలో రైతుల ఖాతాల్లో నగదు జమ కానుందని తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.సొసైటీ రుణాల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.రైతులు తప్పనిసరిగా వడ్డీలు చెల్లించి రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.రుణాలను పునరుద్ధరించుకోవడం ద్వారా రుణమాఫీ, పావలా వడ్డీ రాయితీ వంటి ప్రభుత్వ ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందన్నారు.బకాయిలు చెల్లించని రైతులపై ఇప్పటికే న్యాయపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.బకాయిదారులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని,రికవరీ సెక్షన్ ద్వారా జప్తులు,తనఖా పెట్టిన భూములపై జెండాలు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకునే చర్యలు కొనసాగుతున్నాయని హెచ్చరించారు.రైతు సోదరులు సహకార సంఘాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.ఈ సమావేశంలో కార్యదర్శి బొళ్ళు హనుమంతరావు, డైరెక్టర్లు అడ్డగోడ ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.




## మా బాధలు చూడండి

### వి ఓ ఏ ల దీక్షా వేడుకోలు

**టీ మీడియా ,మే 28 ,కూసుమంచి** :దీర్ఘకాల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా శాంతియుత నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ, మా వైపుగా ఎవరు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా మా బాధలు చూసి మహాప్రభువులైన పాలకులు స్పందించి తక్షణమే డిమాండ్స్ పరిష్కరించాలని కోరుచూ కూసుమంచి మండల వి ఓ ఏ లు తమ నిరసన దీక్ష శిబిరం నుంచి వేడుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు కొనసాగుతున్న నిరవధిక సమ్మె 7 వ రోజు గురువారం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా కూసుమంచి మండల ఐ కె పి ఓ ఏ ల సంయుక్త కార్యాచరణ కమిటీ ( జాక్ బిసెర్ప్ ) ఉపాధ్యక్షురాలు దోమల రజిని, ప్రధాన కార్యదర్శి లోడిగా మంగతాయి మాట్లాడుతూ ప్రజలతో మమేకమై, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతూ మహిళ ఆర్థిక సాధికారత కోసం నిరంతర కృషి చేస్తున్న తమని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సహాయ కార్యదర్శి ఎస్కె నసీమా, కోశాధికారి గోపే ప్రమీల డిమాండ్ చేశారు. కళ్ళకు గంతలు కట్టి తెలపాల్సిన నిరసన అనివార్య కారణంగా, వాయిదా వేస్తూ, తమ నిరసన శుక్రవారం జరుపునున్నట్లు వారు చెప్పారు.కార్యక్రమము లో వి ఓ ఏ లు నాగమణి ,రమాదేవి ,స్వరూప ,ఉషారాణి, సరస్వతి ,లలిత, కన్నె బోయిన రేణుక ,కొత్త జ్యోతి ,బొంత కల్పన ,తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మహిళ మృతి



**టీ మీడియా,మే28,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి గ్రామానికి చెందిన భవనాసి నరసింహారావు భార్య భవనాసి లక్ష్మి (59)అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం కన్నుమూశారు.లక్ష్మి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.గ్రామస్థులు ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

## బౌద్ధ స్తూపానికి

విజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ 'సమగ్ర నివేదిక' ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ వెల్లడించారు.

## ఆక్వా రంగంలో ముందుండాలి

చెప్పారు. యంగ్ ప్రొఫెషనల్ కుమారి బి దివ్య మాట్లాడుతూ నా స్పాట్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ విశిష్టతను తెలిపి, యాప్ డౌన్లోడ్ చేయించి ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించారు. ఈ శిక్షణలో అదిలాబాద్ ,పెద్దపల్లి,ములుగు, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వరంగల్ ఖమ్మం జిల్లాల నుంచి 25 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం మత్స్యకార ప్రతినిధులకు ప్రశంసా పత్రాలు,వలలు ,సీసం ,బెండులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ సిగ నాగరాజు,అశ్వరావుపేట డివిజన్ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## తడిసినా ధాన్యం కొంటాం

యంత్రాంగం ప్రత్యేక అలర్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసిందని తెలిపారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని వెంటనే గుర్తించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా ముందస్తు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని స్పష్టం చేశారు.రెవెన్యూ, సివిల్ సప్లై, రవాణా శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కోఆర్డినేటర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

# జూన్ 9న రీజియన్ విస్తృతస్థాయి సమావేశం

### 16న రాష్ట్ర మహిళా సదస్సు

### ఎస్ డబ్ల్యూ ఎఫ్ నేతలు రవీందర్ రెడ్డి, లింగమూర్తి రాంబాబు



**టీ మీడియా, మే 28 , ఖమ్మం:** ఆర్టీసీ ఉద్యోగులకు సమస్యలు లేకుండా ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్టీసీ యాజమాన్యం ఆర్టీసీ ఉద్యోగుల భవిష్య నిధి,పొదుపు పరపతి సహకార సంఘం,ఎస్ బి టి,ఎస్ ఆర్ బి ఎస్ సంక్షేమ పథకాలకు చెల్లించాల్సిన డబ్బులు వెంటనే చెల్లించాలని,ఆర్టీసీ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా విలీన ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ ఆర్టీసీ సిబ్బంది మరియు కార్మికుల సమాఖ్య-ఎస్ డబ్ల్యూ ఎఫ్(సిఐటియు అనుబంధం) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి,ప్రచార కార్యదర్శి పోరెడ్డి రవీందర్ రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు బాణాల రాంబాబు లు ప్రభుత్వానికి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు.గురువారం ఉదయం ఖమ్మం లోని సుందరయ్య భవనం లో గుండు మాధవరావు అధ్యక్షతన ఏర్పాటైన రీజియన్ కమిటీ సమావేశంలో రవీందర్ రెడ్డి,లింగమూర్తి,బాణాల రాంబాబు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.కుడుదుల వెంకన్న సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా సమావేశం మౌనం పాటించి నివాళులర్పించింది.ఆర్టీసీ సమ్మె అనంతర పరిస్థితులు,ఖమ్మం రీజియన్ లో కార్మికుల పని పరిస్థితులు,ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం తీసుకోవలసిన జాగ్రత్తలు పుస్తకం పట్ల ఆర్టీసీ కార్మికుల స్పందన,ఆర్టీసీ కార్మికుల ఆశలు,ఆకాంక్షలు తదితర విషయాలపై సమావేశం సమీక్షించింది.సమావేశంలో గడ్డం లింగమూర్తి,పోరెడ్డి రవీందర్ రెడ్డి,బాణాల రాంబాబు లు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ ఆంధ్రాలో జరిగిన మాదిరిగా సమస్యలు ఉండకూడదని అందుకోసమే సమస్యలు లేకుండా,రాకుండా విలీన ప్రక్రియ చేపట్టాలనేదే ఎస్ డబ్ల్యూ ఎఫ్ వైఖరి అని స్పష్టం చేశారు.మారిన పని పరిస్థితులకు అనుగుణంగా కండక్టర్లు,డ్రైవర్లు,మెకానికులు,ఆఫీస్ స్టాఫ్,మహిళలు తదితర కేటగిరి వారీగా సదస్సులు జరిపి ప్రత్యక్షంగా కార్మికులు,ఉద్యోగుల నుండి సమస్యలను సేకరించి యాజమాన్యానికి నివేదించడం కోసమే వ్యయప్రయాసలతో సదస్సులు నిర్వహిస్తున్నామని, అందుకని ఎస్ డబ్ల్యూ ఎఫ్ సదస్సుల పేరుతో చేస్తున్న ఈ ప్రయత్నాన్ని విమర్శించడం మానుకొని సహకరించాలని వారు హితవు పలికారు.రాష్ట్ర ప్రభుత్వం,యాజమాన్యం,ఐఏఎస్ ల కమిటీ ఆర్టీసీలోని కార్మిక సంఘాలన్నింటినీ పిలిచి చర్చలు జరుపుతూ ఉంటే ఇంకా మా ఆరు సంఘాల జెఎసి తోనే చర్చించాలి అనడం కార్మిక వర్గం గమనించాలన్నారు. ఆర్టీసీకి కార్మిక వర్గం అనైక్యతతో మనకే నష్టం కలుగుతుందన్నారు.అందుకని బేషజాలకు పోకుండా ఆర్టీసీ కార్మికుల అందరికీ మంచి జరగటం కోసం ఐక్యత కోసం సంఘాలు ఆలోచించాలని సూచించారు.ఆర్ పి ఎస్ 2021లో ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులకు నష్టం కలిగించే అంశాలను యాజమాన్యానికి మెమోరాండం ద్వారా తెలియజేశామని,నష్ట నివారణ చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరినట్లు వారు తెలిపారు.

ఖమ్మం రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు గుండు మాధవరావు పిట్టల సుధాకర్ లు మాట్లాడుతూ ఖమ్మంలో జూన్ 9వ తేదీన రీజియన్ జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని,జూన్ 16వ తేదీన రాష్ట్ర మహిళా సదస్సు ఖమ్మం లోనే జరుగుతుందని అందుకని రెండు కార్యక్రమాల జయప్రదం కోసం డిపో కమిటీల ఆధ్వర్యంలో ఇప్పటి నుంచే కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రీజియన్ ప్రచార కార్యదర్శి తోకల బాబు,కురవటి ప్రతాప్,భూక్యా బాలకృష్ణ,ఇస్న ఎల్లి సామ్యేల్,గుగ్గిళ్ళరోశయ్య,కుడుదులవెంకన్న,గడ్డంవెంకటయ్య, సరిత,డి.ఎన్.రావు రేగళ్ల నరసింహారావు,లింగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యూ లక్ష్మీపురంలో భారీ అగ్నిప్రమాదం

### -రూ.41 లక్షలకు పైగా ఆస్తి నష్టం

**టీ మీడియా, మే 28, ముదిగొండ :**ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో రూ.41 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించింది. పంట పొలాల్లోని వ్యర్థాలకు నిప్పు పెట్టవద్దని అధికారులు పదేపదే హెచ్చరిస్తున్నప్పటికీ, ఓ రైతు తన మొక్కజొన్న కొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు అదుపుతప్పి పక్కనున్న ఆస్తులకు వ్యాపించాయి. ఈ ఘటనలో గ్రామానికి చెందిన కోరట్ల శివకు చెందిన ఆటోమొబైల్ పంచర్ షాపులో నిల్వ ఉంచిన సుమారు రూ.40 లక్షల విలువైన పాత, కొత్త టైర్లు, ట్యూబులు, రీ-బటన్ టైర్లు, డిస్కులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే వడ్డేపూడి ఎల్లయ్యకు చెందిన 500 వరి గడ్డి కట్టలు దగ్ధమై సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లగా, యలగందుల సాయిబాబా పొలంలోని టేకు చెట్లు, వ్యవసాయ మోటారు వైర్లు కాలిపోవడంతో మరో రూ.30 వేల మేర నష్టం సంభవించినట్లు సమాచారం. ఈ సమాచారం అందుకున్న ఖమ్మం అగ్నిమాపక దళం కేవలం 20 నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. అగ్ని పక్కనే ఉన్న ఇళ్లకు, ఇతర వరి గడ్డి వాములకు వ్యాపించకుండా అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్నిమాపక చర్యల్లో ఖమ్మం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి. కోదండ రామిరెడ్డి, లీడింగ్ ఫైర్ ఫైటర్ పి. కిరణ్ కుమార్, ఫైర్ ఫైటర్ అండ్ టెక్నికల్ వి. రాంబాబు, ఫైర్ ఫైటర్లు పి. భాస్కర్, జి. అశోక్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఘటనపై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు



ముమ్మరం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.



## ఎన్టీఆర్ కు నివాళి

### -వారధి ఫౌండేషన్ చైర్మన్ కృష్ణ చైతన్య.

**టీ మీడియా, మే 28, ఖమ్మం**

:ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి , తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళు లర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింత నిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ , ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

